క్లుప్తంగా

ఘనంగా పైడితల్లి అమ్మవారి పండగ


పైడితల్లి అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

మునగపాక : అరబుపాలెం యాతపేటలో మంగళవారం పైడితల్లి అమ్మవారి పండగ ఘనంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు తగు చర్యలు తీసుకున్నారు. సంఘ పెద్దలు తుట్టా వెంకట అప్పారావు, కాకి అప్పలనాయుడు, తుట్టా తలుపులు, పైడికొండతో పాటు కమిటీ సభ్యులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

దేశ నాయకుల జీవిత చరిత్రపై అవగాహన


మునగపాక శాఖా గ్రంథాలయంలో నీతి కథలు చదువుకుంటున్న విద్యార్థులు

మునగపాక : మునగపాక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులు నిర్విరామంగా సాగుతున్నాయి. మంగళవారం జరిగిన శిబిరంలో విద్యార్థులకు పలు రకాల నీతి కథలు అలాగే తెలుగుభాషపై పట్టు పెంచుకునేందుకు అవసరమయ్యే శిక్షణ, అలాగే దేశ నాయకుల జీవిత చరిత్రల గురించి వివరించారు.

లక్ష్యం కోసం చదువుకుంటే ఉజ్వల భవిష్యత్


శివకుమార్‌ను సత్కరిస్తున్న దృశ్యం


మునగపాక : విద్యార్థులు లక్ష్యం కోసం చదువుకోవాలని తద్వారా ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందని ప్రవాస భారతీయుడు భీమిశెట్టి శివకుమార్ పేర్కొన్నారు. మంగళవరపుపేటలో మా ఊళ్లో గ్రంథాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చదవడం అంటే మా కిష్టం కార్యక్రమాన్ని ఆయన మంగళవారం తిలకించారు. గ్రంథాలయ అభివృద్ధికి తన వంతుగా రూ.10 వేల నగదును సాయంగా అందజేశారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ గ్రంథాలయాల ద్వారా విలువైన విజ్ఞానం దొరుకుతుందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయం వ్యవస్థాపకుడు ఏవీఎస్ మూర్తి, గ్రంథాలయ కార్యదర్శి యల్లపు సంజీవరావు, విశ్రాంత ఉపాధ్యాయులు ప్రసాదరావు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా మా ఊళ్లో గ్రంథాలయం అభివృద్ధికి సాయం అందజేసిన శివకుమార్‌ను సత్కరించారు.

ఎన్టీఆర్ ఆశయ సాధనకు పాటుపడాలి


మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న టీడీపీ నేతలు

మునగపాక : మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు ఆశయ సాధనకు పాటు పడాలని టీడీపీ మునగపాక కార్యదర్శి దాడి శివ కోరారు. దివంగత ఎన్టీఆర్ జయంతి సందర్భంగా మంగళవారం మునగపాక టీడీపీ కార్యాలయం ఆవరణలో ఎన్టీ రామారావు చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా రామారావు ఎనలేని సేవలందించారన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు మళ్ల వరహా నరసింగరావు, కేపీ రావు, విల్లూరి నూక నరసింగరావు,దొడ్డి సాంబశివ, బీలా స్రవంతి, శరగడం జగన్, ఆడారి కన్నబాబు, దాడి అప్పలనాయుడు, బీలా లక్ష్మణరావు పాల్గొన్నారు.

సెజ్ కాలనీలో కార్డన్ సెర్చ్


పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

అచ్యుతాపురం : అచ్యుతాపురం సెజ్ కాలనీలో నిర్వహించిన కార్డన్ సెర్చ్‌లో పలు వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 79 ద్విచక్రవాహనాలు, రెండు ఆటోలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సరైన రికార్డులతో వచ్చిన వారికి వాహనాలను అప్పగిస్తామని సీఐ బుచ్చిరాజు తెలిపారు.

అద్దంలా రహదారులు... తీరిన కష్టాలు


రూ.6.9కోట్లతో నిర్మించిన పూడిమడక రోడ్డు


రూ. 6 కోట్లతో నిర్మించిన మునగపాక-వెదురుపర్తి రోడ్డు


రూ.48 లక్షలతో నిర్మించిన మునగపాక బైపాస్ రోడ్డు


రూ.1.8 కోట్లతో నిర్మించిన మూలపేట-తోటాడ రోడ్డు

మునగపాక : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రహదారులు అభివృద్ధి బాటపట్టాయి. ఎక్కడ చూసినా రహదారులు అద్దంలా దర్శనమిస్తున్నాయి. దీంతో రాకపోకలు కష్టాలు తొలగి ప్రజలు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- అనకాపల్లి జాతీయ రహదారి నుంచి అచ్యుతాపురం వరకు 14 కిలోమీటర్ల మేర రహదారి ఉంది. ఈ రోడ్డు ఏళ్ల తరబడి శిథిలావస్థకు చేరుకోవడంతో రాకపోకలు సాగించేవారు అవస్థలు పడేవారు. ఎమ్మెల్యే రమణమూర్తిరాజు కృషితో వీఎంఆర్‌డీఏ ద్వారా రూ.6.9 కోట్ల వ్యయంతో రహదారికి శాశ్వత మరమ్మతులు చేపట్టారు.
- మునగపాక నుంచి వాడ్రాపల్లి, నాగవరం అలాగే పాటిపల్లి, తోటాడ తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగించేందుకు గతంలో నిర్మించిన బైపాస్ రోడ్డు అధ్వానంగా ఉండేది. రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి ప్రత్యేక దృష్టి సారించి వీఎంఆర్‌డీఏ ద్వారా రూ.48 లక్షలు మంజూరు చేయించడంతో రహదారిని అభివృద్ధి చేశారు.
- మునగపాక నుంచి మూలపేట మీదుగా తోటాడ, అనకాపల్లి వైపునకు వెళ్లే రహదారి కూడా ఎంతో అధ్వానంగా ఉండేది. రోడ్డంతా గోతులమయంగా ఉండడంతో రాకపోకలు సాగించేవారు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఎమ్మెల్యే రమణమూర్తిరాజు రూ.1.8 కోట్ల మేర నిధులు మంజూరు చేయించారు. రహదారి అభివృద్ధికి చర్యలు తీసుకున్నారు.
- మునగపాక నుంచి కశింకోటకు వెళ్లేందుకు సరైన రహదారి సదుపాయం లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడేవారు. అనకాపల్లి జాతీయ రహదారికి చేరుకొని అక్కడ నుంచి కశింకోట వెళ్లాల్సి వచ్చేది. దీంతో ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజనా పథకం ద్వారా సుమారు రూ. 6కోట్ల వ్యయంతో మునగపాక నుంచి కశింకోట మండలం వెదురుపర్తి వరకు రహదారి ఏర్పాటు చేశారు. దీంతో ప్రయాణ దూరం తగ్గడంతో పాటు తక్కువ సమయంలో రెండు ప్రాంతాలకు రాకపోకలు సాగించేందుకు అనువైన వాతావరణం ఏర్పడింది.

ప్రయాణ కష్టాలు తీరాయి



గతంలో ఏళ్ల తరబడి రహదారులు అభివృద్ధి చెందలేదు. గత ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలో భాగంగా రహదారుల అభివృద్ధికి తాను చర్యలు తీసుకుంటానని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నారు. దీంతో ఎక్కడకు వెళ్లాలన్నా రహదారి సదుపాయం బాగుండడంతో ప్రయాణం సుఖంగా ఉంటుంది.

–ఆడారి కాశీబాబు, ద్విచక్ర వాహనదారుడు, మునగపాక

ఎన్నడూ లేని అభివృద్ధి



ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చాక ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు విస్మరించడం చూశాం. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రహదారుల అభివృద్ధి కనిపిస్తుంది. గ్రామీణ రహదారులు కూడా అద్దంలా దర్శనమిస్తున్నాయి. గతంలో రహదారులపై ప్రయాణం భయంగా ఉండేది. నేడు అటువంటి పరిస్థితులు లేవు. రహదారులు అభివృద్ధితో గ్రామీణ ప్రాంతాల వారికి రాకపోకలకు సౌలభ్యం ఏర్పడింది.

–రాజాన బుజ్జిబాబు, అంబేడ్కరిజమ్ పునాది అసోసియేషన్ కన్వీనర్

లోవాంబిక అమ్మవారికి వెండి గాజుల బహూకరణ


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

రాంబిల్లి : గోకివాడ గ్రామదేవత లోవాంబిక అమ్మవారికి మంగళవారం అదే గ్రామానికి చెందిన ఎం. గౌరీ పైడమ్మ దంపతులు నాలుగు వెండి గాజులను వితరణ చేశారు. వీటిని అమ్మవారికి అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు ఎ. నాగేశ్వరరావు, దిమిలి పీఏసీఎస్ చైర్‌పర్సన్ ఎస్. రామారావు, డి. గోవిందరావు. పి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

యలమంచిలి : విద్యుత్ మరమ్మతులలో భాగంగా యలమంచిలి మండలం పురుషోత్తపురం సబ్‌స్టేషన్ పరిధిలో 11కె.వి. పిఎస్ఆర్‌పేట ఫీడర్‌కు సంబంధించి లైన్ క్లియరన్స్ కారణంగా బుధవారం మండలంలో పులపర్తి, బయ్యవరం, పద్మనాభరాజుపేట గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని అనకాపల్లి ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రాజశేఖర్ తెలిపారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లకు ఉదయం 5 గంటల నుండి 8 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా చేయబడుతుందని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

బెంబేలెత్తిస్తున్న కుక్కలు


కుక్కల దాడిలో గాయపడిన మేకపోతు

కోటవురట్ల : పల్లెల్లో కుక్కలు బెంబేలెత్తిస్తున్నాయి. విచ్చలవిడిగా తిరుగుతున్న కుక్కలు మనుషులనే కాకుండా మూగజీవాలను కరిచి గాయపరుస్తున్నాయి. రామచంద్రపురంలో నెల రోజులుగా కుక్కలు రెచ్చిపోయి మూగజీవాలను గాయపరుస్తున్నాయి. కుక్కల దాడిలో గేదెలు, మేకలు తీవ్రంగా గాయపడ్డాయి. దాంతో గ్రామస్తులు హడలెత్తిపోతున్నారు. కుక్కల బారి నుంచి మూగజీవాలకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు. వారం రోజుల క్రితం గ్రామానికి చెందిన దాసరి ముసిలినాయుడుకు చెందిన ఆవు పెయ్యను, బొద్దపు అప్పారావుకు చెందిన గొర్రెను, తాజాగా మంగళవారం జానకిరాముడు అనే రైతుకు చెందిన మేకలను కుక్కలు కరిచి తీవ్రంగా గాయపరిచాయి. అధికారులు తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మహిళల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం


సమావేశంలో మాట్లాడుతున్న ఇంఛార్జ్ మున్సిపల్ కమిషనర్ డి.ప్రభాకర్రావు



ర్యాలీ చేస్తున్న మెప్మా సిబ్బంది, మహిళలు


ఎస్.రాయవరం : అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న శివప్రసాద్

- రుతుక్రమంలో పరిశుభ్రతతో ఎన్నో వ్యాధులు దూరం
- మెప్మా ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ

యలమంచిలి రూరల్ : మహిళల జీవితాల్లో రుతుక్రమం సహజ ప్రక్రియ అని, దీనిపై ఎలాంటి అపోహలు పెట్టుకోరాదని ఇంఛార్జ్ మున్సిపల్ కమిషనర్ డి ప్రభాకర్రావు అన్నారు. స్థానిక మెప్మా కార్యాలయంలో అంతర్జాతీయ మెనుస్ట్రువల్ హైజీన్‌డే సందర్భంగా మంగళవారం మహిళలు నెలసరి సమయంలో పరిశుభ్రత పాటించాల్సిన అవసరం, పాటించకపోతే వచ్చే ప్రమాదాల గురించి అవగాహన కల్పించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కమిషనర్ ప్రభాకర్రావు మాట్లాడుతూ సమాజంలో మహిళల స్థానం, పాత్ర ఎంతో కీలకమని మహిళలంతా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. మంచి పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ సీఎంఎం డి.పద్మావతి మాట్లాడుతూ రుతుస్రావం అనే అంశం ఏదో గుసగుసలాడుకునేదిగా మిగిలిపోరాదని, అసంబద్ధ, మూఢ విశ్వాసాలతో కూడిన సామాజిక కట్టుబాట్ల నుంచి మహిళలు బయటపడాలన్న లక్ష్యంతో ప్రతి ఏటా మే 28వ తేదీన అంతర్జాతీయ మెనుస్ట్రువల్ హైజీన్‌డే నిర్వహిస్తున్నట్టు చెప్పారు. రుతుస్రావం సమయంలో పరిశుభ్రత పాటించకపోతే జననేంద్రియాలు, మూత్రనాళాలు, పునరుత్పత్తి అవయవాల్లో అనేక ఇన్‌ఫెక్షన్లు వస్తాయన్నారు. దీర్ఘకాలంలో తీవ్రమైన ఓరల్, సర్వైకల్ క్యాన్సర్ల బారిన పడే ప్రమాదం లేకపోలేదని అభిప్రాయపడ్డారు. పలువురు ఆరోగ్య సిబ్బంది కూడా రుతుస్రావం సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అంతకుముందు మెప్మా కార్యాలయం నుంచి ధర్మవరం వీధుల్లో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో మెప్మా సీవో ఉమ,సీఎల్ఆర్పీ సత్యకృష్ణవేణి, ఏఎన్ఎంలు నాగమణి, సత్యవతి, సచివాలయ సిబ్బంది, ఆర్పీలు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : అచ్యుతాపురం ఎంపీడీవో కార్యాలయంలో బాలికలకు రుతుక్రమంలో పరిశుభ్రత గురించి మంగళవారం అవగాహన కల్పించారు. అచ్యుతాపురం ఎంపీడీవో కార్యాలయంలో అచ్యుతాపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలోనూ, హరిపాలెంలో పీహెచ్‌సీ పరిధిలోని నిర్వహించారు. వైద్యాధికారి వసంత కుమార్, శ్రీనివాస్, రామలక్ష్మి, ఉమా మహేశ్, శోభ, ఇందిర, ముకేశ్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం : మహిళలు ఆరోగ్య భద్రతపై అత్యంత పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని ఏపీఎం శివప్రసాద్ తెలిపారు. వరల్డ్ మెనుస్ట్రువల్ డే పురస్కరించుకు స్థానిక ఐకేపీ కార్యాలయంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సర్వసిద్ధి పీహెచ్‌సీ సిబ్బంది ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సత్యనారాయణ, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేసవి శిక్షణ శిబిరం


యోగాసనాలలో తర్ఫీదు పొందుతున్న విద్యార్థులు


సమ్మర్ క్యాంప్ విద్యార్థులతో ఉపాధ్యాయులు

- విద్యార్థులకు చిత్రలేఖనం, యోగ పై శిక్షణ

యలమంచిలి : యోగా ద్వారా విద్యార్థుల్లో మానసిక ప్రశాంతత కలిగి ఒత్తిడిని అధిగమించడానికి ఎంతో ఉపయోగపడుతుందని ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు రవిశంకర్ గురూజీ శిష్యులు మళ్ల రాము అన్నారు. సమ్మర్ శిక్షణ తరగతుల్లో భాగంగా మంగళవారం యలమంచిలి శాఖాగ్రంథాలయంలో విద్యార్థులకు యోగాపై ఆయన తర్ఫీదునిచ్చి వాటి ఉపయోగాలు, ఆరోగ్య సూత్రాలు, సూచనలు ఇచ్చి పలు యోగాసనాలు విద్యార్థులతో వేయించారు. అంతకు ముందు విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు ద్వారా చిత్రలేఖనం, ఇంగ్లిష్ గ్రామర్ పై అవగాహన కల్పించి, రాత పరీక్షను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల సీనియర్ వై.అప్పారావు .కె.దుర్గారావు, గ్రంథాలయాధికారి వి.ఆనంద్ విద్యార్థులు పాల్గొన్నారు.

వలంటీర్లకు గౌరవ వేతనాలు చెల్లించాలి

ఎస్.రాయవరం : సార్వత్రిక ఎన్నికల కోడ్ వచ్చినప్పటినుంచి, విధులకు దూరంగా ఉన్న గ్రామ వలంటీర్లకు జీతాలు ఎందుకు వేయలేదని పలువురు వాలంటీర్లు మంగళవారం ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లారు.ప్రభుత్వం నియామకంతో ప్రతి నెలా పార్టీలకతీతంగా నిస్వార్థంగా సేవలందించే మమ్మల్ని ఎన్నికల విధులకు దూరంగా ఉండమని చెప్పి రెండు నెలలుగా గౌవర వేతనాలు ఇవ్వకపోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.స్వచ్ఛందంగా రాజీనామా చేసినవారు మినహా సుమారు 3 వందల మంది వరకు ఉన్నామని, కారణం లేకుండా తమకులు గౌరవ వేతనాలు ఎందుకు చెల్లించడం లేదని అడిగారు.ఈ మేరకు ఎంపీడీవో సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామాల్లో విధుల్లో ఉన్న ప్రతి ఒక్కరికి వేతనాలు బిల్లు పెట్టమని పంచాయితీ కార్యదర్శిలకు ఆదేశించామన్నారు. ఈనెలలో రెండు నెలు బిల్లు పెట్టి పంపించే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

ఘనంగా పైడితల్లమ్మ జాతర


అమ్మవారి జాతర సందర్భంగా ఊయల సంబరం


జాతర పూజలందుకున్న శ్రీ పైడితల్లి అమ్మవారు

ఎస్.రాయవరం: కొరుప్రోలు గ్రామంలో శ్రీ పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు.వేకవ జామునుంచి భక్తులు అమ్మవార్ని దర్శించుకునేందుకు పోటీపడ్డారు. గ్రామ శివారు తోటలో కొలువుతీరిన అమ్మవారికి మహిళలు పసుపుకుంకుమలు సమర్పించగా , అన్నదాతలు రైతులు మొక్కులు చెల్లించుకుని , పొలాల్లో పండిన ఫల సాయాలను నైవేద్యంగా సమర్పించారు. గ్రామంలో అన్న సమారాధన నిర్వహించారు. జాతరను పురస్కరించుకుని గ్రామంలో 9 రోజులు అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారికి వైభవంగా ఊయల సంబరం నిర్వహించారు. దీంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది.

విధుల్లో హాజరు నమోదు తప్పనిసరి


మాట్లాడుతున్న ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు

కోటవురట్ల : సచివాలయ ఉద్యోగులు విధులకు హాజరైనపుడు, వెళ్లేటపుడు హాజరు నమోదు తప్పనిసరిగా చేయాలని ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించాలన్నారు. సచివాలయాలలో ఈ–సేవలను మెరుగుపరచాలన్నారు. లబ్ధిదారులతో స్నేహపూర్వకంగా మెలగాలన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనంపై శిక్షణ


తాము గీసిన చిత్రాలను చూపిస్తున్న విద్యార్థులు

రాంబిల్లి: దిమిలి శాఖా గ్రంథాలయంలో మంగళవారం వేసవి విజ్ఞాన శిబిరం కొనసాగింది. విద్యార్థులకు చిత్రలేఖనంపై రీసోర్స్‌పర్సన్స్ అవగాహన కల్పించారు. నీతి కథలు చెప్పి వాటిని చదివించారు. బాలికలకు ముగ్గులు వేయడం నేర్పించారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ ఎస్. శకుంతల , రీసోర్స్‌పర్సన్ నూకినాయుడు పాల్గొన్నారు.

వేడిగాలులకు విలవిల

రాంబిల్లి : భానుడు భగభగలతో పాటు వేడిగాలులతో మంగళవారం ఉక్కిరిబిక్కిరయ్యారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు మరింత ఇబ్బంది పడ్డారు. ఎండ దెబ్బకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. ఎండలు, వేడిగాలులు దృష్ట్యా అవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని దిమిలి పీహెచ్‌సీ వైద్యాధికారి వెంకటేష్ సూచించారు. ఒక వేళ ఇళ్ల నుంచి బయటకు వస్తే తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

మధ్యాహ్న భోజనం రుచికరంగా ఉండాలి


మాట్లాడుతున్న ఎంఈవో వేణుగోపాలరావు

మునగపాక: మధ్యాహ్న భోజన పథకాన్ని సమర్థంగా నిర్వహించాలని ఎంఈవో వేణు గోపాలరావు కోరారు. మంగళవారం మండలంలోని నాగులాపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకం కార్మికులతో సమావేశం నిర్వహించారు. వచ్చే నెలలో పాఠశాలల ప్రారంభంలో భాగంగా పథకం నిర్వహణ సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. వంట పాత్రలు శుభ్రంగా ఉంచాలని, భోజనం రుచికరంగా ఉండేలా చూడాలన్నారు. అనంతరం కార్మికులకు వంటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. జిల్లా కో–ఆర్డినేటర్ అచ్యుతరావు పాల్గొన్నారు.

త్రిపురాంతకస్వామికి పుష్పాంజలి


తిపురాంతకస్వామి, సర్వమంగళాంబల ఉత్సవ విగ్రహాలకు పూలతో అలంకరణ

కశింకోట: స్థానిక పురాతన శివాలయంలో కొలువైన సర్వమంగళాంబ సమేత త్రిపురాంతకస్వామికి మంగళవారం రాత్రి కన్నుల పండువగా పుష్పాంజలి నిర్వహించారు. ఈ నెల 23న స్వామి కల్యాణోత్సవాన్ని భారీగా జరిపిన విషయం తెలిసిందే. ఉత్సవాల ముగింపు రోజున నిర్వహించే పుష్పాంజలి సందర్భంగా స్వామివార్ల కల్యాణోత్సవ విగ్రహాలను నూతన వస్త్రాలు, మల్లెపూల మాలలతో అందంగా అలంకరించారు. పలు రకాల తీపి పదార్థాలు, పండ్లు, ఇతర పదార్థాలు, పాలు, సుగంధ ద్రవ్యాలు నివేదించి, పూజలు చేశారు. ఊయలలో కల్యాణమూర్తులను నిలిపి లాలించారు. భక్తులు భక్తి పారవశ్యంతో పాటలు పాడారు. మంగళవారం ఉదయాన్నే స్వామి మూల విరాట్‌ను, అమ్మవారిని అందంగా అలంకరించి తొలుత పూజలు జరిపారు. ప్రసాద వితరణ చేశారు. స్థానిక విశ్రాంత డ్రాయింగ్ ఉపాధ్యాయుడు భీమిశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భక్తులకు కూల్ డ్రింక్‌లు పంపిణీ చేశారు. ఆలయ అర్చకులు వి.బాబ్జి, వి.కృష్ణల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు


గాయపడిన రమణ

అనకాపల్లి: అనకాపల్లి జిల్లా కేంద్రంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కోటవురట్ల మండలంలోని రాజుపేటకు చెందిన భార్యభర్తలు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు. రాజుపేటకు చెందిన భీశెట్టి వెంకటరమణ భార్య, కుమారుడితో కలిసి విశాఖపట్నం వెళుతున్నారు. అనకాపల్లి మెయిన్‌రోడ్డు డైట్ కళాశాల వద్ద బైక్‌పై వెళుతున్న భార్యభర్తలను కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో వెంకటరమణకు, అతని భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. బాబు సురక్షితంగా బయటపడ్డాడు. క్షతగాత్రులను ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. దీనిపై తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.

8 మందికి ఉచిత కంటి ఆపరేషన్లు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం ఏఎంఏవీఎం రోటరీ కంటి ఆస్పత్రిలో మంగళవారం 8 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించినట్లు రోటరీ ప్రతినిధి రవిరామ్ జవహర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం ఆస్పత్రి ఆవరణలో 28 మంది రోగులకు కంటి పరీక్షలు నిర్వహించగా, అందులో 8 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశామన్నారు.